శాశ్వత పరిష్కారం చూపేదెప్పుడు?

- నాగారంలోని కాసులకత్త వంతెన వద్ద తాత్కాలిక రోడ్డు ఏర్పాటు
- ఏటా వర్షాలకు కొట్టుకుపోతున్న వైనం
- మొరం వేసి రాకపోకలు పునరుద్ధరిస్తున్న అధికారులు
- పూర్తిస్థాయిలో రోడ్డు వేయాలంటున్న ప్రజలు



గతేడాది వర్షకాలంలో వరద నీటికి కొట్టుకుపోయిన రోడ్డు (ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని నాగారం వద్దగల కాసులకత్త వంతెన రోడ్డు గతంలో వర్షాకాలం భారీ వర్షాలకు ఇరువైపులా కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి మొరం వేసి రాకపోకలు పునరుద్ధరిస్తున్నారు. కానీ వరద ఉధృతి కారణంగా గత రెండేళ్లుగా తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోతోంది. శాశ్వత పరిష్కారం చూపకపోతే ఈ వర్షాకాలంలోనూ దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుందని పలు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

నాగారం వద్ద గల కాసులకత్త వంతెన ద్వారా నాగారం, బాయంపల్లి, కొర్పోల్, బాణాపూర్, కిషన్‌నాయక్‌తండా, లక్ష్మన్‌నాయక్‌తండా, లింగంపల్లి, లింగంపేట, నల్లమడుగు, ముస్తాపూర్, తదితర గ్రామాలు, తండాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. దశాబ్దాల నుంచి పలు గ్రామాల ప్రజలు ఈ వాగుపై వంతెన నిర్మించాలని ఎన్నో పర్యాయాలు వినతులు, ఆందోళనలు చేస్తే అధికారులు ఎట్టకేలకు ఆరు సంవత్సరాల క్రితం వంతెన నిర్మించారు. కానీ వంతెనకు ఇరువైపులా వేసిన రోడ్డు గత రెండేళ్లుగా వర్షాలకు కొట్టుకుపోతుంది. అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టగా, మళ్లీ వర్షాకాలంలో అదే పరిస్థితి రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు కొట్టుకుపోతే ఆయా గ్రామాలకు రాకపోలు నిలిచిపోతున్నాయి. ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు సమస్యను పాలకులు, అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల వంతెన కల నెరవేరినా, కొన్ని సంవత్సరాలకే మళ్లీ సమస్యగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి వంతెనకు ఇరువైపులా పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి రోడ్డు పటిష్టంగా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఏటా మొరం వేసి రాకపోకలు పునరుద్ధరించిన తాత్కాలిక రోడ్డు

బడికి వెళ్లడం కష్టంగా మారుతుంది..



భారీ వర్షాలకు రోడ్డు తెగిపోతే ఇతర గ్రామాలకు వెళ్లే విద్యార్థులకు కష్టంగా మారుతుంది. అలాగే రైతులు, వ్యాపారులు సరుకులు, మందులు, ధాన్యం తరలించాలంటే చుట్టూ తిరిగి మెంగారం మీదుగా వెళ్లాల్సి వస్తుంది. అధికారులు వెంటనే స్పందించి బీటీ రోడ్డు వేయాలి.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి. –చింతకుంట అంజయ్య, నాగారం

రాకపోకలు నిలిచిపోతాయి..



గత రెండేళ్లుగా భారీ వర్షాలకు వంతెన ఇరువైపులా రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో రెండు నెలల పాటు పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ వర్షాకాలంలో భారీ వర్షాలు పడితే తాత్కాలికంగా వేసిన రోడ్డు కొట్టుకుపోతుంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. –ఖదీర్, కొర్పోల్

ప్రతిపాదనలు పంపాం..

లింగంపేట మండలం నాగారం వద్ద గల కాసులకత్త వంతెన రోడ్డు మరమ్మతుల కోసం రూ. 50 లక్షలతో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాము. వంతెనకు ఇరువైపులా శాశ్వత పరిష్కారం కోసం వింగ్ వాల్స్ నాలుగు, కింది భాగం నుంచి సీసీతో పాటు 20 మీటర్లు సీసీ రోడ్డు వేయడానికి అంచనా వేసి ప్రతిపాదనలు పంపించాము. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభించి, సమస్యను పరిష్కరిస్తాం. –గిరిధర్, డీఈ, పంచాయతీరాజ్, ఎల్లారెడ్డి

క్లుప్తంగా

విద్యాశాఖ మంత్రిని నియమించాలి



బాన్సువాడ: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు రఘురాం అన్నారు. బాన్సువాడలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాశాఖ మంత్రి ఉంటే విద్యాశాఖ సమస్యలపై దృష్టిసారిస్తారని అన్నారు. పాఠశాలలు ప్రారంభమై పక్షం రోజులు గడుస్తున్నా విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై దృష్టిసారించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాలకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు వంశీ, శివప్రసాద్, సంపత్, మైపాల్, విఠల్, అర్జున్, సురేష్, సంతోష్, బైపాల్, రమేష్ ఉన్నారు.

విద్యార్థులకు ప్రారంభ పరీక్ష నిర్వహించాలి



పిట్లం(జుక్కల్): పాఠశాలలో విద్యార్థులకు ప్రారంభ పరీక్ష నిర్వహించాలని, అందులోని ప్రతిభ ఆధారంగా విద్యా బోధన చేయాలని ఎంఈవో దేవిసింగ్ అన్నారు. పిట్లం జెడ్పీహెచ్ఎస్‌లో శనివారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థులకు ప్రతిరోజు ఆన్‌లైన్ ద్వారా హాజరు నిర్వహించాలని, పుస్తకాలు, యూనిఫామ్‌లు, నోట్‌బుక్స్ తదితర వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు.

రోడ్డును బాగుచేయండి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని దేమికలాన్ నుంచి ఎర్రాపహాడ్ గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. పదకొండేళ్ల క్రితం వేసిన తారు రోడ్డు ప్రస్తుతం పూర్తిగా తొలగిపోయి గుంతలుగా మారింది. ప్రతిరోజు ఈ రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రివేళలో ఈ రోడ్డుపై వెళ్లాలంటే వాహనదారులు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డును బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): వచ్చే నెల 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తామని, మండలంలోని ప్రతీ గ్రామంలో వేడుకలను ఘనంగా జరుపుకోవాలని మండల అధ్యక్షుడు నెల్లూరి గంగారాం సూచించారు. లింగంపేటలో శనివారం ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ ఏర్పడి 30 వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా ప్రతీ గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాలు ఎగురవేయాలని సూచించారు. మండల ఉపాధ్యక్షుడు పోచయ్య, ప్రధాన కార్యదర్శి సాయిలు, యూత్ అధ్యక్షుడు అల్లూరి, జిల్లా నాయకులు ద్యామని భూపతి, లెగ్గల రాజు, కిష్టయ్య, లక్ష్మన్, సురేష్, ప్రకాష్, సంతోష్ పాల్గొన్నారు.

స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని విత్తన, ఫర్టిలైజర్ దుకాణాల్లో తప్పనిసరిగా స్టాక్ నిల్వల బోర్డులు ఏర్పాటు చేయాలని ఏవో అనిల్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని విత్తన, ఎరువుల దుకాణాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులకుచ విత్తనాలకు రసీదులు ఇవ్వాలని దుకాణ నిర్వాహకులకు సూచించారు. ఎరువులను ఈపీవోఎస్ మిషన్ ద్వారానే రైతులకు ఇవ్వాలని ఆదేశించారు.

క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన



గాంధారి(ఎల్లారెడ్డి): రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు తహసీల్దార్ రేణుక చౌహాన్ తెలిపారు. ఈమేరకు శనివారం ఆమె రెవెన్యూ సిబ్బందితో కలిసి శనివారం మండలంలోఇన ముదెల్లి గ్రామంలో పర్యటించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో పర్యటించి, పరిశీలిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

సాక్షి ఎఫెక్ట్..

లో-వోల్టేజీ సమస్య తీరింది



నస్రుల్లాబాద్: మండలంలోని మైలారం గ్రామంలో విద్యుత్ లో-వోల్టేజీ సమస్య తీరింది. గ్రామంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం సమస్యపై ఈనెల 25న సాక్షిలో 'చినుకు పడితే చీకటి' అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి అధికారులు స్పందించి గ్రామంలో డీటీఆర్ మార్చారు. గతంలో గ్రామంలో 15కేవీ డీటీఆర్ ఉండటంతో వోల్టేజీ సమస్య ఉండేదని ప్రస్తుతం 25కేవీ డీటీఆర్ ఏర్పాటు చేశామని లైన్‌మన్ పీరోజీ తెలిపారు. సిబ్బంది సైదా తదితరులు ఉన్నారు.

భవనంపై మొక్కలు తొలగించారు



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం భవనంపై పెరిగిన మొక్కలను అధికారులు తొలగించారు. కార్యాలయంపై మొక్కలు పెరగడంతో ఈనెల 19న సాక్షిలో 'మొక్కే కదా అని వదిలేస్తే..' అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి అధికారులు స్పందించి, భవనంపై ఉన్న మొక్కలను తొలగించారు. మళ్లీ పెరగకుండా మందులను చల్లారు.

సంక్షిప్తం

స్కూల్ బ్యాగుల పంపిణీ

పిట్లం(జుక్కల్): పిట్లం హరిజనవాడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం లయన్స్ క్లబ్ సెక్రెటరీ వేణు విద్యార్థులకు బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఎంఈవో దేవిసింగ్, జోనల్ సెక్రెటరీ కిషన్, ట్రెజరర్ బాలు, సభ్యులు ప్రమోద్, రజని, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

టీఎన్‌జీవోస్ రాష్ట్ర కార్యదర్శిగా సాయిలు

కామారెడ్డి అర్బన్: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం కేంద్ర కార్యదర్శిగా కామారెడ్డి జిల్లాకు చెందిన సాయిలు నియమితులయ్యారు. సాయిలు అంకితభావాన్ని పరిగణనలోకి తీసుకున్న కేంద్ర సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మారం జగదీశ్వర్, ముజీబ్‌హుస్సేనీలు హైదరాబాద్ జిల్లా తరపున కేంద్ర సంఘం కార్యదర్శిగా నియమించారు. అలాగే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా జిల్లా నుంచి కాసం శివకుమార్ నియమితులయ్యారని జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

భూముల సర్వే

నస్రుల్లాబాద్: మండలంలోని బొప్పాస్‌పల్లి విత్తనోత్పత్తి క్షేత్ర భూములు అన్యక్రాంతం అవుతున్నాయని ఇటీవల సంబంధిత అధికారులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి శనివారం సర్వే చేపట్టారు. క్షేత్ర సిబ్బంది హద్దులు వేసుకున్నారు. ఏడీఏ అనిల్, సర్వేయర్ రవిందర్, సిబ్బంది,రైతులు ఉన్నారు.

రన్నింగ్ పోటీలు



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో శనివారం కామారెడ్డి అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రన్నింగ్ పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు. అసోసియేషన్ ప్రతినిధులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్పీని సన్మానించిన పీసీసీ ప్రధాన కార్యదర్శి



కామారెడ్డి టౌన్: పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి శనివారం జిల్లా ఎస్పీ రాజేశ్ చంద్రను మర్యాదపూర్వకంగా కలిసారు. పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నూతన సీఐకి..

కామారెడ్డి టౌన్: పట్టణ నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన నరహరిని శనివారం విద్యార్థి సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి, సత్కరించారు. బీసీ, టీజేఎస్, గిరిజన విద్యార్థి సంఘాల జిల్లా అధ్యక్షుడు నాగరాజు, లక్ష్మణ్‌యాదవ్, వినోత్, నాయకులు రాజేందర్, గణేష్, ఆకాష్ ఉన్నారు.

బీఆర్ఎస్ నేతకు పరామర్శ

భిక్కనూరు: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వంగేటి దుర్గారెడ్డి తండ్రి ఎల్లారెడ్డి ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని శనివారం మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పరామర్శించారు. విండో చైర్మన్లు ఎన్ను వెంకట్‌రెడ్డి, వలకొండ వెంకట్‌రెడ్డి, మాజీ చైర్మన్, చిన్ననర్సరెడ్డి, సాయిరెడ్డి, రాజయ్య, రాంరెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



మాచారెడ్డి: మండల బీఆర్ఎస్ మైనారిటీ విభాగం మాజీ అధ్యక్షుడు జహంగీర్ నాలుగు రోజుల క్రితం మరణించారు. దీంతో బాధిత కుటుంబాన్ని శనివారం మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పరామర్శించి, తక్షణ సహాయంగా రూ. 25వేలు అందించారు. రాంరెడ్డి, బాల్‌చంద్రం, రాజాగౌడ్, గోవింద్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, హాంజినాయక్, కిషన్, అబ్దుల్ ఖాన్, భూక్యా భాస్కర్, చల్ల కృష్ణ ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



ఎల్లారెడ్డి: పట్టణ పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో శుక్రవారం సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు దుంపల శంకర్, నాగం శ్రీనివాస్, కంచం సిద్ధిరాములు, సాయిబాబా తదితరులు తెలిపారు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఐఎస్ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు రవళి అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో శనివారం ఆమె మహిళ సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె పలు అంశాలపై మాట్లాడారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



పెద్దకొడప్‌గల్(జుక్కల్): నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని ఏవో కిషన్ అన్నారు. మండల కేంద్రంలోని అన్ని ఫర్టిలైజర్ దుకాణాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే షాపు లైసెన్స్ రద్దు చేస్తామని దుకాణాదారులకు తెలిపారు. అలాగే మండలంలో రైతులకు కావాల్సినంత విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



దోమకొండ: మహిళలు డ్వాక్రా సంఘాల ద్వారా తీసుకున్న రుణంతో స్వయం ఉపాధులు పెంచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఐకేపీ ఏపీఎం రాజు అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘ సభ్యులు రుణాలను వందశాతం తిరిగి చెల్లించాలని తెలిపారు. అలాగే పలు అంశాలపై చర్చించారు. సమాఖ్య అధ్యక్షురాలు గౌరు లక్ష్మి, ఆర్ఎం కిరణ్ కుమార్, సీసీలు, గ్రామ సంఘ అధ్యక్షులున్నారు.

సమాచారం..

దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట: మండలంలోని కేజీబీవీ పాఠశాలలో ఇద్దరు వంట మనుషుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ శ్రీవాణి ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై వంట చేసిన అనుభవం ఉన్న మహిళలు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు సోమవారం పాఠశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మైనారిటీ స్కూల్‌లో ప్రవేశాలకు..

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని మైనారిటీ గురుకుల బాలిక పాఠశాలలో ఖాళీ సీట్ల భర్తీ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రణతి ఒక ప్రకటనలో తెలిపారు. 5, 6, 7, 8 తరగతులతో పాటు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులో కొన్ని సీట్లు మాత్రమే ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు పాఠశాలలో కానీ, 7995057920ను సంప్రదించాలని కోరారు.

నేడు భిక్కనూరు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

భిక్కనూరు: మండలంలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి ఆదివారం పర్యటించనున్నట్లు బీజేపీ మండలాధ్యక్షుడు ఉప్పరి రమేష్ శనివారం తెలిపారు. మండల కేంద్రంతోపాటు సిద్ధరామేశ్వరనగర్, గుర్జకుంట, ర్యాగట్లపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే తన సొంత నిధులతో అభివృద్ధి పనులను ప్రారంభిస్తాడన్నారు. బీజేపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేటి చిత్రం



ప్రభుత్వ ఆస్పత్రిలో కొనసాగుతున్న రామారెడ్డి జీపీ కార్యాలయం

రామారెడ్డి జీపీకి భవనం నిర్మించాలి

రామారెడ్డి: రామారెడ్డి గ్రామ పంచాయతీకి సొంత భవనం లేకపోవడంతో 2016 నుంచి జీపీ కార్యాలయం రామారెడ్డి ప్రభుత్వాస్పత్రి (ఆయుర్వేదిక్)కి సంబంధించిన చిన్న గదిలో కొనసాగుతోంది. దీంతో జీపీ అధికారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే జీపీకి సొంత భవనం నిర్మించాలి. –రాజేందర్, రామారెడ్డి

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

కామారెడ్డి : 94942 60200 | ఎల్లారెడ్డి : 97053 46576 | బాన్సువాడ : 94402 11363 | జుక్కల్ : 97053 46578

ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి





జుక్కల్‌లో ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలిస్తున్న అధికారులు.. కోనాపూర్‌లో..

నిజాంసాగర్(జుక్కల్): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. జుక్కల్ మండలం చిన్నగుల్లా గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను శనివారం ఆయన పరిశీలించారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టకుంటే ఇళ్లు రద్దు చేస్తామన్నారు. కార్యదర్శి సుధాకర్ తదితరులు ఉన్నారు.

బీబీపేట: మండలంలోని కోనాపూర్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్ పరిశీలించారు. అలాగే యాడారం గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యదర్శి భరత్, తదితరులు ఉన్నారు.

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అయిలాపూర్, రాంపల్లి, పోతాయిపల్లి, లింగంపేట గ్రామాల్లో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పనులను ఎంపీడీవో నరేష్ పరిశీలించారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని లబ్ధిదారులకు సూచించారు.



అయిలాపూర్‌లో..

నస్రుల్లాబాద్ మండలంలో..

నస్రుల్లాబాద్: మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో సూర్యకాంత్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. ప్రతి గ్రామంలో సానిటేషన్ పనులు, వన మహోత్సవం పనులను చేపట్టాలన్నారు. కార్యదర్శులు రవి, సౌందర్య, ఫయాజ్ తదితరుల పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని వదల్‌పర్తిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీవో ప్రభాకరచారి పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. అలాగే అక్కంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలసి హౌసింగ్ ఏఈ సందీప్ మార్కింగ్ ఇచ్చారు.





నస్రుల్లాబాద్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో సూర్యకాంత్. అక్కంపల్లిలో..

ఆధ్యాత్మికం..

గ్రామదేవతలకు జలాభిషేకం



మద్నూర్(జుక్కల్): వానాకాలం ప్రారంభం అయిన వర్షాలు సరిగ్గా కురవకపోవడంతో మద్నూర్‌లో రైతన్నలు ఏకమై శనివారం గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. ఈసందర్భంగా గ్రామస్తులు, యువకులు, రైతులు నీళ్ల బిందెలతో మండల కేంద్రంలో ప్రధాన వీధుల గుండ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని హనుమాన్, శివాలయం, విఠలేశ్వర ఆలయాల్లోని దేవతామూర్తిలకు జలాభిషేకం నిర్వహించారు. ఈసారి వర్షాలు సమృద్ధిగా కురిసి రైతన్నల ఇంట్లో సిరిసంపదలు కురువాలని వారు వేడుకున్నారు. అనంతరం ప్రజలకు అన్నదానం ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పఠనం



బీబీపేట: మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో శనివారం ఉదయం భక్తులు సామూహిక హనుమాన్ చాలీసా పఠనం చేశారు. అంతకుముందు ఆలయంలోని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అంజన్నకు ప్రత్యేక పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని అంజన్న ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి విగ్రహాన్ని జిల్లెడ ఆకులు, తమలపాకులు, పువ్వులు, చందూరంతో అందంగా అలంకరించారు. అనంతరం హన్మాన్ పారాయణం, చాలీసా పఠించారు.

కాలభైరవుడికి పీసీసీ ప్రధాన కార్యదర్శి పూజలు



రామారెడ్డి: మండలంలోని కాలభైరవుడి ఆలయాన్ని శనివారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్ కుమార్తె గిరిజా షెట్కర్ సందర్శించారు. ఈసందర్భంగా ఆమె స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామారెడ్డి మండల అభివృద్ధికి సహకరిస్తానని ఆమె హామీ ఇచ్చినట్లుగా మండల కాంగ్రెస్ నాయకులు తెలిపారు. నాయకులు లక్ష్మాగౌడ్, డైరెక్టర్ రావుఫ్, ప్రసాద్, రాజు, సుధాకర్, రవి, నర్సింలు, పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కామారెడ్డి & ఎల్లారెడ్డి
96034 62494
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
బాన్సువాడ: యం. మధుసూధన్ : 9951027699
ఎల్లారెడ్డి: ఎం. శ్రీనివాస్ : 9704490298
కామారెడ్డి : కె. రాజు : 9949699861
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899